**201 వ అధ్యాయం**

# ٢٠١ - بَابُ سُنَّةِ الْمَغْرِبِ بَعْدَهَا وَقَبْلَهَا

# మగ్రిబ్‌కు ముందు, దాని తర్వాత చేయబడే సున్నత్‌లు

تَقدَّمَ في هذه الأبوابِ حديثُ ابنِ عُمَرَ، وَحديثُ عائشةَ، وَهما صَحيحانِ أَنَّ النبيَّ ﷺ كانَ يُصلِّي بَعْدَ المغرِبِ رَكعَتَيْنِ.

క్రితం అధ్యాయాల్లో హజ్రత్ ఇబ్నె ఉమర్ మరియు ఆయిషా (రజి)లు వివరించిన ప్రామాణిక హదీసుల ద్వారా దైవప్రవక్త (సల్లం) మగ్రిబ్ తర్వాత రెండు రకాతులు చేసేవారని తెలుస్తోంది.

١١٢٢ - وَعَنْ عَبْدِ اللهِ بنِ مُغَفَّلٍ رَضِيَ اللهُ عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قالَ: «صَلُّوا قَبْلَ المَغرِبِ» قَالَ في الثَّالثَة: «لِمَنْ شَاءَ» رواه البخاري.

1122. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ముగప్ఫల్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లం) "మగ్రిబ్‌కు ముందు నమాజ్ చేయండి" అని (మూడుసార్లు) అన్నారు. మూడోసారి 'చేయదలచిన వారు' అని అన్నారు. (బుఖారీ)

*(సహీహ్ బుఖారీలోని తహజ్జుద్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

మగ్రిబ్ అజాన్ తర్వాత ఫర్జ్ నమాజ్‌కు ముందు రెండు రకాతుల సున్నత్ నమాజ్ చేయటం అభిలషణీయం. ఎన్నో ఇతర హదీసులు కూడా ఈ విషయాన్ని సమర్థిస్తున్నాయి. వాస్తవానికి ఈ నమాజు గైర్ ముఅక్కదా అయినప్పటికీ దైవప్రవక్త (సల్లం) దాన్ని నెరవేర్చమని మూడుసార్లు తాకీదు చేయటం ద్వారా దాని ప్రాముఖ్యత వెల్లడౌతోంది. మొత్తానికి ఈ నమాజు చేయటం అభిలషణీయం అన్న విషయంలో మాత్రం ఎలాంటి సందేహం లేదు. రాబోయే హదీసులు ఈ విషయాన్ని మరింతగా నొక్కి వక్కాణిస్తునాయి.

١١٢٣ - وعن أَنسٍ رَضِيَ اللهُ عَنْهُ قالَ: لَقدْ رَأَيتُ كِبَارَ أَصحابِ رسولِ

1123. హజ్రత్ అనస్ (రజి) కథనం: నేను దైవప్రవక్త సహచరుల్లో గొప్ప గొప్ప వారిని చూశాను. వారు మగ్రిబ్

اللهِ ﷺ يَبْتَدِرُونَ السَّوَارِيَ عندَ المغربِ. رواه البخاري.

వేళ మస్జిద్ స్తంభాల దగ్గరికి వెళ్ళటానికి తొందరపడేవారు. (బుఖారీ)

*(సహీహ్ బుఖారీలోని నమాజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

దైవప్రవక్త సహచరులు మగ్రిబ్ వేళ ఫర్జ్‌కు ముందు మస్జిద్ నిట్టాడులను 'సుత్రా'గా చేసుకొని రెండు రకాతుల నమాజ్ చేసేవారు. అయితే మస్జిద్‌లో సహచరులందరికీ చాలినన్ని నిట్టాడులు ఉండేవికావు. అందుకని వారు నిట్టాడుల కోసం పరస్పరం పోటీ పడేవారు. ఈ హదీసు ద్వారా బోధపడే రెండో విషయం ఏమిటంటే, మస్జిద్‌లో నఫిల్ లేక సున్నత్ నమాజులు చేసేటప్పుడు ఎదురుగా ఏదయినా వస్తువు అడ్డం 'సుత్రా' పెట్టుకోవటం అవసరం. సుత్రా లేకుండా సాధారణంగా జనం నడిచే దారిలో నమాజుకు ఉపక్రమించకూడదు. ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మసలుకోవాలి.

١١٢٤ ـ وَعَنْهُ قَالَ: كُنَّا نُصَلِّي عَلى عَهدِ رسولِ اللهِ ﷺ رَكْعَتَيْنِ بَعْدَ غُروبِ الشَّمسِ قَبلَ المَغرِبِ، فَقِيلَ: أَكَانَ رسولُ اللهِ ﷺ صَلاَّهُمَا؟ قالَ: كانَ يَرانَا نُصَلِّيهِمَا فَلَمْ يَأْمُرْنَا وَلَمْ يَنْهَنَا. رَوَاهُ مُسْلِمٌ.

1124. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) కాలంలో మేము సూర్యాస్తమయం తర్వాత మగ్రిబ్ ఫర్జ్‌కు ముందు రెండు రకాతులు చేసే వారము.

అనస్ (రజి) ఈ హదీసును వివరిస్తున్నప్పుడు ఎవరో ఆయన్ని "మరి దైవప్రవక్త (సల్లం) కూడా చేసేవారా?" అని అడగ్గా, 'మేము ఆ రెండు రకాతులు చేస్తుండగా ఆయన మమ్మల్ని చూసే వారు. అయితే ఆయన మమ్మల్ని చేయమని ఆజ్ఞాపించేవారు కాదు. వద్దని వారించేవారు కూడా కాదు" అని చెప్పారు. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని ప్రయాణీకుల నమాజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ఈ హదీసు ద్వారా దైవప్రవక్త సహచరులు మగ్రిబ్ ఫర్జ్‌కు ముందు రెండు రకాతులు,

అది కూడా దైవప్రవక్త సమక్షంలోనే చేసేవారని తెలుస్తోంది. అయితే హజ్రత్ అనస్ (రజి) ఈ హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈ విషయంలో తటస్థ వైఖరిని అవలంబించారనీ, దీని గురించి ఆయన ఆజ్ఞాపించేవారు కాదనీ, దాన్ని వారించేవారు కూడా కాదనీ అభిప్రాయపడ్డారు. ఇది ఆయన అభిప్రాయం మాత్రమే. ఎందుకంటే ఇంతకు ముందు వచ్చిన హదీసుల్లో దైవప్రవక్త (సల్లం) మగ్రిబ్‌కు ముందు నమాజు చేయమని మూడుసార్లు తాకీదు చేసి మరీ ఆదేశించారని చెప్పబడింది. బహుశా హజ్రత్ అనస్ (రజి) గారికి ఈ హదీసు గురించి తెలిసి ఉండకపోవచ్చు. అందుకే ఆయన ఆ విధంగా అభిప్రాయపడ్డారు.

١١٢٥ ـ وعنه قَالَ: كُنَّا بِالمَدِينَةِ فَإذَا أَذَّنَ المُؤَذِّنُ لِصَلاةِ المَغرِبِ، ابْتَدَرُوا السَّوَارِيَ، فَرَكَعُوا رَكْعَتَيْنِ، حَتَّى إنَّ الرَّجُلَ الغَرِيبَ لَيَدْخُلُ المَسْجِدَ فَيَحْسَبُ أَنَّ الصَّلاةَ قَدْ صُلِّيَتْ مِنْ كَثْرَةِ مَنْ يُصَلِّيهِمَا. رَوَاهُ مُسْلِمٌ.

1125. హజ్రత్ అనస్(రజి) కథనం: మేము మదీనాలో ఉన్నప్పుడు ముఅజ్జిన్ మగ్రిబ్ నమాజ్ కోసం అజాన్ ఇవ్వగానే ప్రజలు (మస్జిద్) నిట్టాడుల కోసం పోటీపడేవారు. ఆ తర్వాత రెండు రకాతుల నమాజ్ చేసేవారు. వారు ఆ నమాజ్ ఎంత ఎక్కువగా చేసేవారంటే, క్రొత్త వ్యక్తి ఎవరయినా మస్జిద్‌కు వస్తే వారి వాలకం చూసి ఫర్జ్ నమాజ్ అయిపోయిందేమో (ప్రజలు ఆ తర్వాతి సున్నత్ నమాజులు చేసుకుంటున్నారేమో) ననుకుంటాడు. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని ప్రయాణీకుల నమాజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు:

మొత్తానికి పై హదీసుల ద్వారా బోధపడేదేమిటంటే దైవప్రవక్త సహచరులు మస్జిదె నబవీలో మగ్రిబ్ వేళ ఫర్జ్ నమాజ్‌కు ముందు రెండు రకాతుల నఫిల్ నమాజును అనవాయితీగా చేసేవారు. అయినప్పటికీ ఆ నమాజు సున్నతె గైర్ ముఅక్కదాగానే పరిగణించబడుతుంది. ఫర్జ్ తర్వాత చేసే రెండు రకాతులు మాత్రం 'సున్నతె ముఅక్కదా'గా పరిగణించబడతాయి.